

మంత్రి జమీర్ అహ్మద్‌పై హైకోర్టులో పిటిషన్


బెంగళూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వసతి, వక్ఫ్‌శాఖల మంత్రి జమీర్ అహ్మద్‌పై సామాజిక కార్యకర్త టీజే అబ్రహాం హైకోర్టులో శుక్రవారం కోర్టు ఉల్లంఘన ఫిర్యాదు పిటిషన్ దాఖలు చేశారు. ముడా వివాదానికి సంబంధించి కోర్టు, ముఖ్యమంత్రి సిద్దరామయ్య సమర్పించిన పిటిషన్‌ను కొట్టేసిన సందర్భంగా కోర్టు తీర్పు రాజకీయ ప్రేరేపితమని మంత్రి జమీర్ ఆరోపించారు. మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ సామాజిక కార్యకర్త అబ్రహాం 'కోర్టు ధిక్కరణ' కింద మంత్రిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల కోర్టు లోకాయుక్త విచారణకు ఆదేశించారు.

విచారణం..!

- కోర్టుల చుట్టూ మూడు పార్టీల కీలక నేతలు
- ముడా కేసులో సీఎం..అక్రమాస్తుల కేసులో డీసీఎం పోక్సో కేసులో యడ్డీ..డీనోటిఫికేషన్‌లో కుమార ఎలక్టోరల్ బాండ్ల వివాదంలో విజయేంద్ర..
- ఇటు కేసులు..అటు ఉపఎన్నికలు
- మూడుస్థానాల్లో ముంచుకొస్తున్న ముహూర్తం














బెంగళూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భిన్నమైన రాజకీయ ప్రహసనం సాగుతోంది. మూడు ప్రధాన రాజకీయ పార్టీల ముఖ్యనేతలు కేసులు, విచారణల్లో మునిగి తేలుతున్నారు. ఎటువంటి విచారణ ఎదుర్కోవాలి, ఏ విధమైన ప్రశ్నలు ఉద్భవిస్తాయి, ఈ పరిణామం ఎంతవరకు దారి తీస్తుందనే భయం ఆ ముగ్గురినీ వెంటాడుతోంది. ఇదే తరుణంలోనే మూడు శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికల సమరం ముంచుకొస్తోంది. వారంలో షెడ్యూల్ వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

సమీపిస్తున్న ఉప ఎన్నికలు

రాష్ట్రంలో మూడు శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో హావేరి జిల్లా శిగ్గావి, రామనగర జిల్లా చన్నపట్టణ, బళ్ళారి జిల్లా సండూరు నియోజకవర్గాలు ఉన్నాయి. మూడింట రెండు బీజేపీ-జేడీఎస్ కూటమికి చెందినవి కాగా సండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉండేవారు. చన్నపట్టణ ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి మండ్య లోక్‌సభ నుంచి గెలుపొంది కేంద్రమంత్రిగా ఉన్నారు. ఇక శిగ్గావి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై ప్రస్తుతం హావేరి ఎంపీగా కొనసాగుతున్నారు. ఇక సండూరు నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న తుకారాం బళ్ళారి లోక్‌సభ సభ్యుడయ్యారు. ఇలా ముగ్గురు ఎమ్మెల్యేలు లోక్‌సభ సభ్యులు కావడంతో మూడు స్థానాలకూ ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. లోక్‌సభ ఎన్నికలు జరిగి ఐదు నెలలు కావస్తుండగా ఫలితాలు వెలువడి మూడు నెలలు ముగిసింది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఖాళీగా ఉండే ఎమ్మెల్యే స్థానాలకు ఉప ఎన్నికలు జరిపేందుకు జిల్లా అధికారులను, రాష్ట్ర ఎన్నికల అధికారుల ద్వారా సమాచారం సేకరించారు. ఇటీవలే రాష్ట్ర ఎన్నికల కమిషన్ సమగ్ర నివేదిక పంపినట్లు తెలుస్తోంది. అక్టోబరు ప్రారంభంలోనే షెడ్యూల్ ఖరారయ్యే అవకాశం ఉంది. ఎన్నికలు జరిగే మూడు స్థానాల్లోనూ కీలక నేతలే కావడంతో మూడు పార్టీలు వీటిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. వీటిలో సండూరు, శిగ్గావి కంటే చన్నపట్టణ స్థానం హై ఓల్టేజీగా మారింది. ఇక్కడ ఎన్నికలను డీసీఎం డీకే శివకుమార్, కేంద్రమంత్రి కుమారస్వామి సవాల్‌గా తీసుకున్నారు. ఇక్కడ కుమారస్వామి సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా ఉన్నారు. మరోసారి ఇక్కడ అధికారం దక్కించుకోవాలని చూస్తు న్నారు. ఇటీవల తరచూ జేడీఎస్ యువనేత, కుమార వారసుడు నిఖిల్ చన్నపట్టణను సందర్శిస్తున్నారు. మరోవైపు ఇక్కడ అభ్యర్థి నేనే, నన్ను చూసి ఓటు వేయండంటూ డీసీఎం డీకే శివకుమార్ వెల్లడించారు. నెలరోజుల వ్యవధిలో చన్నపట్టణను దాదాపు 10 పర్యాయాలకుపైగా ఆయన సందర్శించడం, గ్రామ స్థాయిలో ప్రజాదర్బార్ తరహాలో స్థానిక సమస్యల పరిష్కరించడం, వందల కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. చన్నపట్టణంలో మరింత పట్టు సాధించేలా నగరపాలక సంస్థను కాంగ్రెస్ కైవశం చేసుకుంది. జేడీఎస్‌కు చెందిన 13 మంది నగరసభ సభ్యులు కాంగ్రెస్‌లో చేరడంతో నగర పాలకను దక్కించుకుని జేడీఎస్‌కు షాక్ ఇచ్చారు.

దాదాపు అభ్యర్థులు వీరే...

చన్నపట్టణలో డీసీఎం డీకే శివకుమార్ తమ్ముడు, మాజీ ఎంపీ డీకే సురేశ్ అభ్యర్థి కానున్నారని ప్రచారం సాగుతోంది. ఇక్కడ కాంగ్రెస్ నుంచి మరొకరి పేరు ప్రస్తావన లేదు. ఇదే స్థానం నుంచి మరోసారి పోటీ చేయాలని బీజేపీ ఎమ్మెల్సీ సీపీ యోగేశ్వర్ తీవ్రస్థాయిలో ప్రయత్నం చేస్తున్నారు. ఆయనకు కేంద్రంలో తాజాగా ఓ పదవి కేటాయించే హామీతో చెక్ పెట్టేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మరోవైపు కుమారస్వామి వారసుడు నిఖిల్ ఇక్కడ నుంచి పోటీ చేస్తారనే ప్రచారం సాగుతోంది. ఇక శిగ్గావిలో బీజేపీ నుంచి బొమ్మై కుమారుడి పేరు హల్‌చల్ చేస్తుండగా సండూరు నుంచి బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా శిల్ప రాఘవేంద్ర పేరు వినిపిస్తోంది. సండూరు ఎన్నికల్లో ప్రస్తుతం గాలి జనార్ధనరెడ్డి ప్రభావం బీజేపీకి అనుకూలం కానుంది. గత ఎన్నికల్లో ఆయన కల్యాణ రాజ్య ప్రగతి పార్టీ ద్వారా పోటీ చేసిన విషయం తెలిసిందే. ఇటీవలే బీజేపీలో విలీనం కావడంతో అనుకూలం అవుతోంది.



అగ్రనేతలకు కేసుల తిప్పలు

మూడు పార్టీల ముఖ్యనేతలు కేసుల ఊబిలో సతమతమవుతున్నారు. సీఎం సిద్దరామయ్యపై ముడా వివాదంలో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆయనతోపాటు భార్య, బావమరిది కూడా నిందితులు కావడంతో ఆయన విచారణలు ఎదుర్కొనేందుకు సిద్ధం అవుతున్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన మైసూరు లోకాయుక్త విచారణ కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఇక డీసీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు హైకోర్టులో అక్రమాస్తుల కేసు నుంచి భారీ ఊరట లభించినా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు కావడంతో ఆయన విచారణ ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇక బీజేపీ అగ్రనేత యడియూరప్పపై పోక్సో కేసు మెడపై కత్తిలా తూగుతోంది. ఇక డీనోటిఫికేషన్ కేసులోనూ విచారణలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు విజయేంద్రపైన తాజాగా ఎలక్టోరల్ బాండ్ల అవినీతిపై తిలక్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇక జేడీఎస్ నేత, కేంద్రమంత్రి కుమారస్వామిపై డీ నోటిఫికేషన్ కేసు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం విచారణకు హాజరయ్యారు. ఇలా కీలక నేతలు ఓ వైపు విచారణ..మరోవైపు ఎన్నికల సమరానికి సిద్ధం కావల్సి రావడం ఆసక్తిగా మారింది.

కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ స్థాయి సమితి సభ్యురాలిగా

ఎంపీ ప్రభా మల్లికార్జున

- ఆర్థికస్థాయి సమితి సభ్యుడిగా ఎంపీ సుధాకర్..

బెంగళూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దావణగెరె నుంచి తొలిసారి ఎంపీగా గెలుపొందిన డాక్టర్ ప్రభా మల్లికార్జున్ కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ స్థాయి సమితి సభ్యురాలిగా నియమితులయ్యారు. 18వ లోక్‌సభలో దావణగెరె ఎంపీ డాక్టర్ ప్రభా మల్లికార్జున్‌కు అవకాశం కల్పిస్తూ స్పీకర్ ఓంబిర్లా శుక్రవారం నియమించారు. స్థాయి సమితిలో రాజ్యసభకు చెందిన పదిమంది సభ్యులు, లోక్‌సభ నుంచి 21మంది సభ్యులు కొనసాగనున్నారు. సమితికి అధ్యక్షుడిగా ప్రొఫెసర్ రామ్‌గోపాల్ యాదవ్‌ను నియమించారు.



డాక్టర్ ప్రభా మల్లికార్జున్

కాగా కేంద్ర ఆర్థిక స్థాయి సమితి సభ్యుడిగా చిక్కబళ్ళాపుర ఎంపీ డాక్టర్ సుధాకర్‌ను నియమించారు. ఈమేరకు వారికి బీజేపీ రాష్ట్ర విభాగం ట్వీట్ ద్వారా అభినందనలు తెలిపింది. ఆర్థికస్థాయిసమితి అధ్యక్షుడిగా భర్తృహరి మహతాబ్‌ను నియమించారు. ఆర్థికస్థాయిసమితి సభ్యుడిగా అవకాశం కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తూ డాక్టర్ సుధాకర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



ఎంపీ డాక్టర్ సుధాకర్

ఎమ్మెల్యే మునిరత్న ఇంటిపై సిట్ దాడి

బెంగళూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కుల దూషణ, అత్యాచార ఆరోపణలతో జైలులో ఉన్న రాజరాజేశ్వరినగర్ బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నంకు మరో షాక్ తగిలింది. శనివారం ఎమ్మెల్యే ఇంటిపై సిట్ పోలీసులు దాడులు నిర్వహించారు. డీఎస్పీ కవితా నేతృత్వంలో దాడులు కొనసాగించి డిజిటల్ సాక్షాలను పరిశీలించారు. మూడు వాహనాలలో ఎఫ్ఎస్ఎల్ బృందాలతో 15కుపైగా అధికారులు దాడుల్లో పాల్గొన్నారు. వయ్యాలికావల్‌లోని ఎమ్మెల్యే నివాసం సహా మరో 15 చోట్ల దాడులు కొనసాగించారు. ఇప్పటికే జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న మునిరత్న అక్టోబరు 5వరకు పరప్పన అగ్రహార జైలులోను ఉండనున్నారు. కాంట్రాక్టర్ చలువరాజ్‌ను బెదిరించి కులదూషణ చేశారనే ఆరోపణపై మునిరత్న తొలుత అరెస్టు అయ్యారు. అనంతరం జ్యుడీషియల్ కస్టడీలో పరప్పన అగ్రహారజైలులో ఉన్న ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. అంతలోనే అత్యాచార ఆరోపణలపై కగ్గలిపుర పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్ నమోదై మరోసారి అరెస్టు అయ్యారు. ఇలా మునిరత్నపై రోజుకో కేసులు వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది.



గాంధీ జయంతి రోజు

స్వచ్ఛత ప్రతిజ్ఞ

- అన్ని పాఠశాలల్లో అమలుకు విద్యాశాఖ ఆదేశాలు



మీడియాతో డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతి రోజు రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో స్వచ్ఛతా ప్రతిజ్ఞను తప్పనిసరిగా నిర్వహించాలని శనివారం విద్యాశాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. గాంధీ జయంతికి సంబంధించిన ఏర్పాట్లపై డీసీఎం డీకే శివకుమార్ విధానసౌధలో సమీక్ష జరిపారు. సమావేశంలో విద్యాశాఖతోపాటు వివిధశాఖల ముఖ్యులు పలువురు పాల్గొన్నారు. అనంతరం డీసీఎం మీడియాతో మాట్లాడుతూ బాపూజీ 155వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. గాంధీజీ గౌరవార్థం అందరూ ఖద్దరు టోపీలను ధరించాలని పిలుపునిచ్చారు. దేశభక్తి, సమానత్వం, శాంతి, అహింస వంటి అంశాలపై ప్రచారం చేయడంతోపాటు సమాజంలో స్వచ్ఛత, శ్రమదానం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలాంటి చైతన్య కార్యక్రమాలు జరపాలని ఆయన పేర్కొన్నారు.

కాగా స్వాతంత్ర్య సంగ్రామం వేళ 1924లో బెళగావిలో జరిగిన జాతీయ కాంగ్రెస్ సభకు గాంధీజీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి వందేళ్లు పూర్తి అయిన సందర్భంగా చారిత్రాత్మక జ్ఞాపకంగా రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కిలోమీటరు పాటు నడక, ప్రతిజ్ఞ జరుపుతామన్నారు. కాగా అంతకుముందు బెంగళూరు నగర ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక సమీక్షా సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

లోతెంతైనా ప్రయాణం ముందుకే..



టా(జీ)ప్ లేపారు..!

- ఆకట్టుకున్న ఆఫ్‌రోడ్ ఛాలెంజింగ్ మోటార్ స్పోర్ట్స్
- హంపిలో ఐదోసారి
- పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహణ
- అబ్బురపరిచిన విన్యాసాలు

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 28: ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని చారిత్రక ప్రసిద్ధి గాంచిన హంపిలో చాలెంజింగ్ మోటార్ స్పోర్ట్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. శుక్రవారం ప్రారంభమైన ఈ పోటీలు శనివారం మరింత ఉత్సాహంగా కొనసాగాయి. ఈ సందర్భంగా జీపులతో క్రీడాకారులు చేసిన సాహసాలు ఒళ్లు గగుర్పొడించాయి. విజయనగర, హొసపేట ఎమ్మెల్యే హెచ్.ఆర్.గవియప్ప సాహస క్రీడలకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. సాధారణంగా కార్ రేస్ పోటీలు రోడ్డుపై జరగడం సహజం.. అయితే అందుకు భిన్నంగా రోడ్డుపై కాకుండా కొండలు, గుట్టల ప్రాంతాల్లో మోటారు స్పోర్ట్ క్రీడలు నిర్వహించడం సాహసోపేతమైన క్రీడగా చెప్పకోవచ్చు. ప్రాణాలను పణంగా పెట్టి పోటీల్లో పాల్గొనడం నిజంగా సాహసోపేతమైన చర్య అని చెప్పవచ్చు. వాహనాల డ్రైవింగ్‌లో అత్యంత అనుభవం... నైపుణ్యం కలిగిన వారే ఈ క్రీడల్లో పాల్గొంటారు. పర్యాటకులను ఆకర్షించడానికి గత నాలుగు సంవత్సరాల క్రితం ప్రారంభమైన ఆఫ్‌రోడ్ ఛాలెంజింగ్ మోటార్ స్పోర్ట్స్... ఐదో సంవత్సరం విజయవంతంగా ముగిశాయి. విజయనగర జిల్లా పరిధిలోని హొసపేట చుట్టుప్రక్కల పచ్చని కొండలు, లోయలు, ఎక్కడం, జారడం పడిపోవడం, ఎక్కడం వంటి విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కారిగనూరులోని చిత్రదుర్గ-బళ్ళారి హైవే ప్రక్కన మూడు ట్రాక్‌లు నిర్మించగా, రాజాపూర్‌లోని కొం డల్లో మనుషులు వెళ్ళేందుకు ఇబ్బందిగా ఉండే చోట వాహనాలు కొండపైకి ఎక్కాయి. కొందరు మెల్లగాలోయలోకి జారి మళ్ళీ పైకి వెళ్లారు. వాహనాల పటిష్టత గోడలాంటి ప్రదేశంలో పెన్సింగ్ సాయంతో దిగిన డ్రైవర్ల సాహసాలు సందర్శకులను ఆశ్చర్యానికి గురి చేశాయి.

దేశంలో



రహదారి కాదు...రాళ్లదారి

దేశంలో నాలుగు చోట్ల మాత్రమే...

దేశంలో నాలుగు చోట్ల మాత్రమే జాతీయ స్థాయి ఆఫ్ రోడ్ చాలెంజ్ పోటీలు నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. గోవా, కేరళ, రాజస్థాన్ తరువాత హొసపేట నాలుగో స్థానం దక్కించుకుంది. ఇలాంటి జాతీయ స్థాయి ఛాలెంజింగ్ పోటీలు పట్టణంలో జరగడం జిల్లాకు గర్వకారణం. ఆఫ్‌రోడ్ మోటారు స్పోర్ట్స్‌కు హొసపేట చుట్టుప్రక్కల ఉన్న కొండలు, లోయలు అనుకూలమని నిర్వాహకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఐదవ సారి జరిగిన 'ఉత్సవ్ ది హంపి' ఆఫ్ రోడ్ ఛాలెంజ్‌లో -2024 క్రీడాపోటీల్లో 80 వాహనాలు పాల్గొన్నాయి. ఇందులో ప్రోమోడిఫైడ్, మోడిఫడ్, స్టాక్ కేటగిరీలు ఉన్నాయి. ఒక్కో వాహనంలో ఇద్దరు చొప్పున మొత్తం 160మంది డ్రైవర్లు, పది మంది మహిళలు పాల్గొన్నారు. మహారాష్ట్ర, గోవా, తమిళనాడు, కేరళ, రాజస్థాన్, ఢిల్లీలతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఔత్సాహికులు పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో కొందరు వరుసగా ఐదో రౌండ్‌లో పాల్గొనడం విశేషం. వాకీటాకీలు అమర్చిన 60మందికి పైగా ఆపదలో అండగా నిలిచారు. అవసరమైన ఫైర్ ఇంజన్, అంబులెన్స్, క్రేన్ వంటి సౌకర్యాలు సిద్ధంగా ఉంచారు.



కొండ దిగాలన్నా సాహసం కావాలి మరి...



ఇకపై ప్రతిరోజూ గుడ్డు

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో ప్రతి రోజూ కోడిగుడ్డు అందించనున్నారు. ఇదివరకు వారానికి రెండు రోజులు మాత్రమే ఇచ్చేవారు. అయితే అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో ఆదివారం మినహా ఆరు రోజులు గుడ్డు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం పలు పాఠశాలల్లో ప్రారంభించారు.

7లో

టాటా ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

- మూడువేలమంది కార్మికులు సురక్షితం

కృష్ణగిరి జిల్లా హోసూరు నగరంలోని కూతనపల్లి ప్రాంతంల్లో మొబైల్ ఫోన్ విడిభాగాలను తయారు చేసే ప్రైవేట్ ఫ్యాక్టరీలో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో సుమారు 3వేలమంది కార్మికులు సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నలుగురు అస్వస్థతకు గురి కాగా వారిని ఆసుపత్రికి తరలించారు.

8లో



ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న భారీ మంటలు




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం తదితరులు

మైసూరులో బిజీగా సీఎం

ముఖ్యమంత్రి సిద్దరామయ్య మైసూరు పర్యటనలో రెండోరోజు శనివారం పలు కార్యక్రమాలతో బిజీగా గడిపారు. గ్యారెంటీ పథకాల గురించి ప్రత్యేక పుస్తక విడుదల కార్యక్రమంలో మహనీయుల మాటలను ప్రస్తావించారు. ఆకలైనవ్యక్తికి అన్నం ఇవ్వడం ద్వారా దేవుడికి సమర్పించే కానుక వంటిదన్నారు. గ్యారెంటీ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఎన్ని కష్టాలెదురొచ్చినా పథకాలను ప్రజలకు అందేలా చూస్తామన్నారు.

7లో



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,618.79
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	22,513	881
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	14,408	9,549
సామర్థ్యం (టీఎంసీలు)	101.77	58.00

3 నుంచి ఆంజనేయ నవరాత్రి ఉత్సవాలు



ప్రత్యేకాలంకరణలో పేటే ఆంజనేయస్వామి

సిరుగుప్ప, సెప్టెంబరు 28: అక్టోబరు 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు పేటే ఆంజనేయస్వామి ఆలయంలో శరన్నవరాత్రిఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధానఅర్చకులు శ్యామాచార్య తెలిపారు. గురువారం ప్రారంభయ్యే శరన్నవరాత్రి ఉత్సవాలు విజయదశమి వరకు జరుగనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ పంచామృతాభిషేకం, పుష్పార్చన, నైవేద్యం, మహామంగళహారతి, రాత్రి స్వామివారికి ప్రత్యేకాలంకార సేవలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గురువారం పాడ్యమి రోజున ఆంజనేయస్వామిగా, శుక్రవారం దర్బా ఆంజనేయస్వామిగా, మూడవ రోజు శ్వేతనీలాంజేయస్వామిగా, 4వ రోజు పేటే ఆంజనేయస్వామిగా, 5వ రోజు దీదళ ఆంజనేయస్వామిగా, 6వ రోజు ముత్తిన ఆంజనేయస్వామిగా, 7వ రోజు హరిద్రాంజనేయగా, 8వ రోజు ధ్యాన ఆంజనేయస్వామిగా, 9వ రోజు వర్ణ ఆంజనేయస్వామిగా, విజయదశమి రోజున పుష్పాంజనేయ స్వామిగా అలంకరించనున్నట్లు తెలిపారు. భక్తులు ఈ సేవల్లో పాల్గొని శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సండూరు ఉప ఎన్నికలకు బీజేపీ నుంచి ముగ్గురు



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి

బళ్లారి సిటీ, సెప్టెంబరు 28: ఎస్టీ రిజర్వుడ్ అసెంబ్లీ నియోజకవర్గం సండూరు ఉపఎన్నికల కోసం కాంగ్రెస్, బీజేపీల్లో కార్యకలాపాలు ఊపందుకున్నాయి. కర్ణాటక బీజేపీ ఇన్‌చార్జి రాధామోహన్ అగర్వాల్ నేతృత్వంలో బీజేపీ పార్టీ కార్యకలాపాలు ప్రారంభించింది. బీజేపీ నుంచి వై.దేవేంద్రప్ప, రాష్ట్ర బీజేపీ వాల్మీకి విభాగం అధ్యక్షుడు బంగారు హనుమంత, గతంలో కేఆర్‌పీ నుంచి పోటీ చేసిన కే.దివాకర్ పేర్లను ఖరారు చేసి హైకమాండ్‌కు పంపారు. వీటిని పరిశీలించి ఎన్నికల తేదీ ప్రకటించిన వెంటనే అర్హులైన అభ్యర్థి పేరును పార్టీ ప్రకటిస్తుంది. కాంగ్రెస్ పార్టీలో హైకమాండ్ టికెట్ ఖరారు చేస్తుంది. కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థి ఎంపిక తలనొప్పిగా మారింది. బీజేపీ బూత్ స్థాయిలో ప్రచారం నిర్వహిస్తూ పార్టీ సంస్థాగతంగా పక్కా ప్రణాళికలతో ముందుకెళుతోంది. సండూర్ నియోజవర్గంలో ఆరు మేజర్‌పంచాయితీలు ఉన్నాయి. ఒక్కో పంచాయతీ నుంచి ఇద్దరు నేతలకు బీజేపీ బాధ్యతలు అప్పగించడంతో పాటు కాంగ్రెస్ వైఫల్యాలను ఓటర్లకు తెలియజేసి బాధ్యతను కూడా పార్టీ వారికే అప్పగించింది.

జిల్లా కోర్టు ఆవరణలో శ్రమదానం



శ్రమదానం చేస్తున్న న్యాయాధికారి

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 28: జిల్లా చట్ట సేవ ప్రాధికార, జిల్లా న్యాయవాదుల సంఘం, బళ్ళారి కార్పొరేషన్ ఆధ్వర్యంలో గాంధీజయంతిని పురస్కరించుకుని స్వచ్ఛతా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎవరో వచ్చి.. ఏదో చేస్తారనే నిరీక్షణ కన్నా... తమ పరిసరాలను తామే శుభ్రం చేసుకోవాలనే స్వచ్ఛతాహి సేవా అభియాన్-2024 కార్యక్రమంలో భాగంగా వీటిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకోర్టుకు చెందిన పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.





చెత్తాచెదారం వేసే ప్రాంతాన్ని శుభ్రం చేసి ముగ్గులు వేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

చెత్త డంపింగ్ నివారణకు వినూత్న రంగోలి

పరిసరాల పరిశుభ్రతపై అవగాహనకు కొత్త యత్నం

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 28: ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచేందుకు బళ్లారి కార్పొరేషన్‌లో వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. నగర పరిధిలోని 39వార్డుల్లో స్థానికుల బాధ్యత తెలియజెప్పే రీతిలో నగరంలో ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. చెత్తాచెదారం వేసే ప్రాంతాల్లో కార్పొరేషన్ సిబ్బంది శుభ్రంచేసి పేడతో కళ్లాపి చల్లి ముగ్గులు వేస్తున్నారు. దీంతో అక్కడ చెత్తవేయడానికి ప్రజలు జంకుతున్నారు. నగరంలోని ప్రతి వార్డు కార్పొరేటర్ ఈ కార్యక్రమాలను దగ్గరుండి చేయిస్తుండడంతో ప్రజల్లో పరిసరాల స్వచ్ఛత పట్ల అవగాహన క్రమేపీ పెరుగుతోంది. బళ్ళారి సిటీ కార్పొరేషన్ పరిధిలో సగానికి పైగా మురికి వాడలే ఎక్కువగా ఉండడంతో పరిసరాల అపరిశుభ్రత కూడా అంతే స్థాయిలో ఉంది. దీంతో కార్పొరేషన్ పాలక మండలి ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. దీని పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలని, చుట్టు ఉన్న పరిసరాలు కాపాడుకుంటే మన ఆరోగ్యం కాపాడుకున్నట్లేనని కార్పొరేషన్ కమీషనర్ ఖలీల్ పేర్కొన్నారు.

విద్యార్థులకు యూనిఫారం పంపిణీ



పంపిణీ చేసిన యూనిఫారంతో విద్యార్థులు

గంగావతి రూరల్, సెప్టెంబరు 28: దాతలు పాఠశాల ప్రారంభంలోనే విద్యార్థులకు యూనిఫారం పంపిణీ చేస్తే విద్యార్థులు పాఠశాలకు రావడానికి అనువుగా ఉంటుందని ఆపాఠశాల అభివృద్ధి సమితి ఉపాధ్యక్షులు రాజేశ్వరి ఎం.జి. అభిప్రాయ పడ్డారు. నిధుల కొరత కారణంగా ప్రభుత్వం 2016-17 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఇవ్వాల్సిన షూ-సాక్సులు ఇవ్వలేదన్నారు. గతంలో ప్రతి విద్యార్థికి షూ, రెండు జతల సాక్సులు ఇవ్వడానికి కేవలం రూ 225లు అందజేసిందని, అయితే ఈ సారి అదికూడా ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రముఖులు పట్టణంలోని హిరేజంతకల్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు యూనిఫారం, ప్లేట్లు పంపిణీ చేశారు. తల్లితండ్రులు రోజూ విద్యార్థులకు పాఠశాలకు వెళుతున్నారా లేదా తరచూ పరిశీలించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్‌డిఎంసి అధ్యక్షులు జయడిప్ప, ప్రధానోపాధ్యాయులు తిమ్మప్ప కంబళి, ఎస్‌డిఎంసి సభ్యులు భీమేష రామణ్ణ,రేవతి, సుమంగళ, రాఘవేంద్ర, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కణజ్‌కు స్పందన నిల్

- ఆస్తుల డిజిటలైజేషన్‌కు కార్పొరేషన్ యత్నం
- రికార్డుల్లో 1,30,457 ఆస్తుల గుర్తింపు
- ఇప్పటివరకూ 24వేలు మాత్రమే అప్‌లోడ్
- నమోదు తరువాతనే కొత్తగా క్రయవిక్రయాలు

బళ్ళారి గాంధీనగర్, సెప్టెంబరు 28: బళ్లారి కార్పొరేషన్ పరిధిలోని ఆస్తుల డిజిటలైజేషన్('ఆస్తి కణజ్')కు ప్రజల నుంచి పెద్దగా స్పందన కన్పించడంలేదు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ 'ఆస్తి కణజ్'కు అవసరమైన ఆధార పత్రాలు అందించడంలో నగర ప్రజలు నిరాసక్తి చూపుతున్నారు. దీంతో ప్రజల ప్రయోజనాల కోసం ఏర్పాటైన కార్యక్రమం కాస్తా నీరుగారి పోతోంది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ (కర్ణాటక మున్సిపల్ డేటా అసోసియేషన్) కార్పొరేషన్ పరిధిలోని భవనాలు, ఖాళీ స్థలాల డిజిటలైజేషన్‌కు అసెట్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసింది. స్థానిక సంస్థల ఆస్తులన్నింటినీ ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు.

బళ్ళారి కార్పొరేషన్ పరిధిలో 1,25,975 ఆస్తులు (నివాస, వాణిజ్య, పారిశ్రామిక, ఖాళీ స్థలాలు) ఉన్నాయి. అయితే బిల్ కలెక్టర్లు సేకరించిన సమాచారాన్ని ఆస్తి కణజ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయడంతో బళ్ళారి నగరంలో ఇప్పుడు మొత్తం 1,30,457 ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. అయితే ఇందులో కేవలం 24వేల ఆస్తుల రికార్డులను మాత్రమే అప్‌లోడ్ చేశారు. ఇంకా 1.05లక్షల మంది ఆస్తి యజమానులు పత్రాలు అందించాల్సి ఉందని అధికారులు తెలుపుతున్నారు. ఈ ఆస్తుల రికార్డులను సేకరించడంలో కార్పొరేషన్‌కు సవాల్‌గా మారింది. తమ ఆస్తులు ఏమవుతాయోననే భయంతో కొందరు, పన్ను ఎక్కడ పెరుగుతుందోనని భయంతో మరికొందరు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికీ కొంతమది తమ ఆస్తులను కార్పొరేషన్ జప్తు చేస్తుందనే భయంతో ఉన్నారు. దస్తావేజుల సేకరణ కోసం బిల్ కలెక్టర్లు ప్రజల వద్దకు వెళ్ళినపుడు ప్రజల పెద్దగా ఆసక్తి కనబరడం లేదు. ఇది ఆస్తుల డిజిటలైజేషన్ అని, దీని వలన ప్రజలకు మేలు జరుగుతుందని, వారిఆస్తులు రికార్డులు భద్రపరచబడతాయని అధికారులు చెబుతున్నారు. అక్రమంగా దస్తావేజులను మార్చి భూములు లాక్కొనే వ్యాపారం ఆగిపోతుందని, మాఫియా, అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట పడుతుందని. పన్నుల లెక్కింపులో అక్రమాలను కూడా అరికట్టవచ్చునని ఆస్తులకు సంబంధించి సమస్య ఉంటే వాటిని పరిష్కరించడంలో కూడాఇది సహాయపడుతుందని అంటున్నారు.



ఆస్తిని నమోదు చేసిన తరువాత పిఎస్ఆర్ నెంబరు ఇస్తారని, ఈ నెంబరు ఉపయోగించి ఆస్తి పన్నులను చెల్లించవచ్చునని, పత్రాలు ఎప్పుడైనా పొందవచ్చని డెప్యూటీ కమీషనర్ బి.అబ్దుల్ రెహమాన్ ఖాన్ అభిప్రాయ పడుతున్నారు.

ఆస్తి పన్నులో పారదర్శకత...

గతంలో ఆస్తిపన్ను నిర్ణయం అధికారులు చేతుల్లో ఉండేది. కాని ఇపుడు నిబంధనలు చాలా మెరుగు పడ్డాయి. దీనికి తోడు ఆస్తి కణజ్ లాంటి సాఫ్ట్‌వేర్ కూడా అమలులోకి రావడంతో ఆస్తి స్వభావం ఆధారంగా పన్ను మొత్తం ఆటోమేటిక్‌గా నిర్ణయిస్తారు. మీ ఆస్తి పన్ను గడువు తేదీని మొబైల్ నెంబరు, ఇ-మెయిల్ ద్వారా తెలియజేస్తారు. ఆస్తిపన్ను కోసం ప్రజల కార్యాలయాల కోసం వెళ్ళాల్సిన పని ఉండదు. బిబిపిఎస్(భారత్ బిల్ పే సిస్టమ్) ఫోన్ పే, గూగూల్ పే, బిహెచ్‌ఐఎం, పోస్టల్ బ్యాంకు యాప్‌ని ఉపయోగించి పన్ను చెల్లించే అవకాశం ఏర్పడుతుంది. తద్వారా పన్నుల లెక్కింపు, చెల్లింపులలో దళారుల జోక్యం ఉండదని కార్పొరేషన్ అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

ఆదాయం వృద్ధి అంచనా

ఆస్తి కణజ్ డిజిటలైజేషన్ ప్రారంభమైన తరువాత కార్పొరేషన్‌కు వార్షికంగా రూ.45కోట్ల ఆస్తిపన్ను వసూలు కావాల్సిఉందని కార్పొరేషన్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ సాఫ్ట్‌వేర్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉపయోగించే కావేరి సాఫ్ట్‌వేర్‌కు లింకు చేయబడిన కారణంగా ఫారమ్- 2 పొందిన తరువాతనే ఆస్తులు కొనుగోలు, అమ్మకాలకు అనుకూలంగా ఉంటుందని, కనుక ప్రజలు సహకరించాలని డెప్యూటీ కమీషనర్ విజ్ఞప్తిచేశారు.

జేడీఎస్ జిల్లా యూత్ అధ్యక్షుడిగా కిరణ్ కుమార్



యూత్ అధ్యక్షులను సన్మానిస్తున్న జేడీఎస్ నాయకులు

బళ్లారిరూరల్, సెప్టెంబరు 28 : బళ్లారి నగర జేడీఎస్ కార్యాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన జేడీఎస్ సమావేశంలో జేడీఎస్ జిల్లా అధ్యక్షులు మీనళ్లి తాయన్న, దేవదుర్గ జేడీఎస్ ఎమ్మెల్యే కరియమ్మ నేతృత్వంలో బళ్లారి జిల్లా జేడీఎస్ యూత్ అధ్యక్షుడుగా కిరణ్‌కుమార్‌ను, బళ్లారి నగర అధ్యక్షుడిగా వన్నూరప్ప (వండ్రి)లను ఎన్నుకుని, బాధ్యతలు అప్పజెప్పారు. ఈ కార్యక్రమంలో చండూరు తాలుకా జేడీఎస్ అధ్యక్షులు కురేకుప్ప సోమప్ప, ఎస్టీ విభాగ అధ్యక్షులు అర్దగిరి రామన్న, బళ్లారి గ్రామాంతర తాలుకా అధ్యక్షులు అశోక్, సిరుగుప్ప తాలుకా అధ్యక్షులు శివ నారాయణ, కంప్లి తాలుకా అధ్యక్షులు మేఘరాజు, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడిగా రామకృష్ణ

బళ్లారి రూరల్ : బళ్లారి నగరంలో బళ్లారి జిల్లా చేనేత సహకార కార్మికులు సంఘం అధ్యక్షుడిగా రామకృష్ణ ఎన్నిక కావడంతో ఆయనను సంఘం సభ్యులతో పాటు పలువురు ప్రముఖులు ఘనంగా సన్మానించారు. సొసైటీ అధ్యక్షులు రామకృష్ణ, అర్దగిరి రామన్నతో పాటు పలువురు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేడీఎస్ ఎస్టీ విభాగ జిల్లా అధ్యక్షులు అర్దగిరి రామన్న, ఎస్జీవో వీరేష్, లక్ష్మీదేవి, ప్రమీల, పద్మావతి, లక్ష్మీ, రాజా చిన్న, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

బళ్లారి, విజయనగర జిల్లాల్లో పలుచోట్ల ప్రదర్శనలు, సమావేశాలు



బళ్లారిలో..



తోరణగల్లులో..



రాయచూరులో..




కంప్లిలో..

స్వాతంత్ర్య పోరాట యోధుడు, విప్లవకారుడు భగత్ సింగ్ 117 జయంతిని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఏఐడిఎస్‌ఓ బళ్ళారి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విమ్స్ మైదానం, ఐటిఐ గ్రౌండ్, వార్డా కళాశాల, మోకా ప్రభుత్వ పియు కళాశాలలో భగత్ సింగ్ భావ చిత్రానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏఐడిఎస్‌ఓ జిల్లా కార్యదర్శి కంబాలి మంజునాథ్ మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేసిన భగత్ సింగ్ నవ్వుతూ ఉరికంబాన్ని ఎక్కి ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. పూజ నర్సింగ్ కళాశాలలో జరిగిన జయంతి వేడుకల్లో జిల్లా మెడికల్ సలహాదారుడు ప్రమోద్ మాట్లాడుతూ భగత్‌సింగ్ గొప్ప స్ఫూర్తి అన్నారు. కంప్లి తాలుకా ఎమ్మిగనూరు గ్రామంలో జడే సిద్దేశ్వర ఎడుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో, తోరణ గల్లు కురేకుప్ప పట్టణంలో జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. - ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

హోసూరు జోన్

హోసూరు టాటా ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం

హోసూరు, సెప్టెంబరు 28: హోసూరు నగరంలోని కూతనపల్లి ప్రాంతంల్లో మొబైల్ ఫోన్ విడిభాగాలను తయారు చేసే ప్రైవేట్ ఫ్యాక్టరీలో శనివారం చోటు చేసుకున్న ప్రమాదంలో సుమారు 3వేలమంది కార్మికులు సురక్షితంగా బయట పడ్డారు. అకస్మాత్తుగా చోటు చేసుకున్న మంటలు కొద్దిసేపట్లోనే క్రమేపీ అంతటా వ్యాపించడంతో చుట్టుపక్కల భారీగా పొగ నెలకొంది. దీంతో నలుగురు వ్యక్తులు అస్వస్థతకు గురి కాగా వారిని ఆసుపత్రికి తరలించారు. తింజేపల్లి పంచాయతీ కూతనపల్లి ప్రాంతంలో సెల్‌ఫోన్ విడిభాగాలను తయారు చేసే టాటా ఎలక్ట్రానిక్ ఫ్యాక్టరీలో వివిధ రాష్ట్రాలకు చెందిన 20 వేలమందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. శనివారం ఉద యం 6 గంటలకు కార్మికులు తమ షిఫ్ట్ తర్వాత ఇంటికి వెళుతుండగా, రసాయనాల విభాగంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన కార్మికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. రాయకోట, డెంకణీకోటలకు చెందిన అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌లతో చేరుకుని మంటలను ఆర్పారు. అలాగే అక్కడ ఉన్న సుమారు 3వేలమందిని సురక్షితంగా అక్కడనుంచి బయటకు పంపేశారు. కృష్ణగిరి, హోసూరు, డెంకణీకోట, బర్గూరు, రాయకోట, పాలకోడ్ నుంచి 8 అగ్నిమాపక వాహనాలు వచ్చాయి. బెంగళూరు నుంచి కూడా ప్రత్యేకంగా ఫైర్ ఇంజన్‌లు చేరుకుని సుమారు 5 గంటలకుపైగా శ్రమించి మంటలను ఆర్పివేశారు. అగ్నిప్రమాదం కారణంగా కార్మికులకు శనివారం సెలవులు ప్రకటించారు. ఘటనపై కలెక్టర్ కె.ఎం.సరయు, ఎస్పీ తంగదురైలు అత్యవసర సమావేశం నిర్వహించి ఘటనపై ఆరా తీశారు. కర్మాగారం చుట్టుపక్కల ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలకు పొగ ప్రభావం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా తళి ఎమ్మెల్యే రామచంద్రన్, వేపన్నపల్లి కే.పి మునిస్వామి, కెలమంగలం యూనియన్ కమిటీ అధ్యక్షుడు కే శవమూర్తి, సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఉద్దనపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న భారీ మంటలు, పొగ

పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి



సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు

హోసూరు సెప్టెంబరు 28 : తమిళనాడులో 3.5 లక్షల మందికి పైగా ఉద్యోగులకు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తమిళనాడు ప్రభుత్వ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. హోసూరు సర్కిల్ సదస్సు తేరుపేట ప్రాంతంలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మంటపంలో ఉద్యోగుల సమావేశం జరిగింది, ఈ సమావేశానికి శివ అధ్యక్షత వహించారు. జాయింట్ సెక్రటరీ హేమనందినీ దేవి వివరాలను తెలిపారు. ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి ప్రారంభోత్సవం చేశారు. కార్యదర్శి తిమ్మరాజ్ కార్యక్రమ కోశాధికారి అరుణ్‌కుమార్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. జిల్లా అధ్యక్షుడు చంద్రన్, కార్యదర్శి కల్యాణసుందరం అందరికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 300 ప్రభుత్వ ఉద్యోగుల పత్రిక చందాలు, 475 ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యత్వాలు జిల్లా అధ్యక్షునికి అందజేశారు. హోసూరును కార్పొరేషన్‌గా చేసిన తర్వాత కనీసం 278 పోస్టులను సృష్టించేందుకు రోడ్డు కార్మికులను పర్మినెంట్ చేసి, 41 నెలల లేఆఫ్ కాలాన్ని పదవీకాలంగా క్రమబద్ధీకరించాలని కోరారు. అధ్యక్షులు తిమ్మరాజు, కోశాధికారి అరుణ్‌కుమార్, నూతన సర్కిల్ నిర్వాహకులను ఎంపిక చేశారు, సమావేశం ముగింపుల్లో రాధ ధన్యవాదాలు తెలిపారు.

దసరా ఉత్సవాలు సంబరంగా నిర్వహించుకోవాలి



దసరా ఉత్సవాల గోడ పత్రిక విడుదల చేస్తున్న డీసీ

రాయచూరు, సెప్టెంబర్ 28 : దసరా ఉత్సవాలకు ప్రఖ్యాతిగాంచిన మైసూరులో మాదిరిగానే సింధనూరులో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలను సంబరంగా శాంతియుతంగా నిర్వహించుకోవాలని జిల్లాధికారి సతీశ్ సూచించారు. సింధనూరు నగరంలోని నగరసభ కార్యాలయం వద్ద శనివారం దసరా ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం మాట్లాడిన జిల్లాధికారి, దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా 9 రోజుల పాటు నిర్వహించే దసరా ఉత్సవాలు అర్థవంతంగా శాంతియుతంగా అన్ని వర్గాల సహకారంతో నిర్వహించుకోవాలన్నారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి వివిధకమిటీలు ఏర్పాటుచేసుకోవాలని అందుకు బాధ్యులైన అధికారులు సమన్వయంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించుకోవాలన్నారు.

పౌష్టికాహారంతోనే రోగ నిరోధక శక్తి

కంప్లి, సెప్టెంబరు 28 : గ్రామాలలో వుండే మహిళలు, చిన్నారులు, గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకోవడం వల్లనే రోగనిరోధక శక్తి ఏర్పడుతుందని డాక్టర్ ప్రసాద్ తెలిపారు. బుక్కసాగర గ్రామంలో మహిళా శిశు సంక్షేమ అధికారులు బుక్కసాగరం నాలుగవ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సరియైన ఆహారం తీసుకోలేకపోవడం వలన ఎంతో మంది రోగాల బారిన పడుతున్నారన్నారు. నిర్లక్ష్యం వల్ల ఇటు పిల్లలు, మహిళలు అనారోగ్యం పాలై ఆస్పత్రిలో చేరుతున్నారన్నారు. అజాగ్రత్త వల్ల ఇబ్బందులు కూడా ఎదుర్కొంటున్నారన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరు పౌష్టికాహారం తీసుకుని తమ ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు.అనంతరం రాజేశ్వరి మాట్లాడుతూ, మహిళా శిశుసంక్షేమ శాఖ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ మహిళలకు, పిల్లలకు, అందించే సదుపాయాలను, ప్రభుత్వం ద్వారా ఇచ్చే టీకాలు, మందులను ఉపయోగించుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు ఒడి నింపే కార్యక్రమం చేపట్టారు. వారితో పాటు సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ టీచర్ ఖలీదా, శాంతి, ఓంకారమ్మ, విశాలాక్షి, సులోచన, శశికళ, మీనాక్షి, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు ఒడి నింపుతున్న శిశుఅభివృద్ధి అధికారి రాజేశ్వరి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

మెహమూద్ (జయంతి)



బాలీవుడ్‌లో ప్రముఖ నటుడు మెహమూద్ అలి 1932 సెప్టెంబరు 29న ముంబైలో జన్మించారు. గాయకుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా రాణించారు. నాలుగు దశాబ్దాలలో 300కుపైగా సినిమాలలో నటించారు. ప్రత్యేకించి హాస్యపాత్రలతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఉత్తమ హాస్య నటుడిగా, సపోర్టింగ్ యాక్టర్‌గా ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. 2004 జూలై 23న కన్నుమూశారు.

బాలి (జయంతి)



ప్రముఖ వ్యంగ్య చిత్రకారుడు 'బాలి' 1945 సెప్టెంబరు 29న అనకాపల్లిలో జన్మించారు. అసలు పేరు ఎం శంకరరావు. వేల సంఖ్యలో కథలు, నవలలకు బొమ్మలు వేశారు. చిత్రకళపై మక్కువతో 'అమ్మే కావాలి' నవలను రాసి తానే బొమ్మలు గీశారు. 'ఆంధ్రజ్యోతి'లో ధారావాహికంగా ప్రచురితమై పాఠకుల మన్ననలు అందుకుంది. సంపాదకులు పురాణం సుబ్రమణ్యంశర్మ ఆయన పేరును 'బాలి'గా మార్చి ప్రోత్సహించారు. 'చందు' అనే బాలల సాహిత్యపత్రికకు సంపాదకత్వం వహించారు. 2023 ఏప్రిల్ 17న విశాఖపట్టణంలో కన్నుమూశారు.

డాక్టర్ గురవారెడ్డి (పుట్టినరోజు)



డాక్టర్ అన్నపరెడ్డి వెంకట గురవారెడ్డి 1958 సెప్టెంబరు 29న గుంటూరులో జన్మించారు. కీళ్ళ వ్యాధులకు చికిత్సలో సిద్ధహస్తుడు. ఒక ఏడాదిలో 4వేల శస్త్ర చికిత్సలు నిర్వహించి ఆసియా రికార్డు నెలకొల్పారు. కిమ్స్ ఆసుపత్రి సంస్థాపకులలో ఒకరు. హైదరాబాద్‌లోని సన్‌షైన్ ఆసుపత్రుల మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ ఎక్స్‌పర్ట్. అంతకుముందు ఇంగ్లండులో పదేళ్ల, అపోలో ఆసుపత్రిలో కొంతకాలం పనిచేశారు. కాగా ఆర్థోప్లాస్టీపై పలు పుస్తకాలు రాశారు. ఢిల్లీ తెలుగు అకాడమీచే ఎక్సలెన్స్ అవార్డు, ఉగాది పురస్కార్ 2010 తదితర గౌరవాలు అందుకున్నారు.

చిన్న పరిశ్రమలకు మరింత చేయూత

● మంత్రి శోభాకరంద్లాజె

బెంగళూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు వీలుగా దేశంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ ఎంఎస్ఇ ఫోరం ఇండియా, అమెజాన్ వంటి ఈ-కామర్స్ సంస్థలతో 8 వారాలలోగా విదేశాలకు ఎగుమతి చేసేలా ప్రత్యేక కార్యక్రమం చేపట్టనుందని కేంద్ర ఎంఎస్ఎంఇ మంత్రి శోభాకరంద్లాజె వెల్లడించారు. 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులను ప్రోత్సహించేలా ఐఎస్ఎఫ్ అనే పరికల్పనను చిన్న, మధ్య పరిశ్రమల మంత్రి త్వ శాఖ చేపట్టనుందన్నారు. బిజినెస్ బియండ్ బోర్డర్స్ 2024 సదస్సును శనివారం లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. దేశానికి చెందిన చిన్న, మధ్య పరిశ్రమలు అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యాపార లావాదేవీలు నిర్వహించేందుకు వీలుగా 8వారాల్లో ఎగుమతి ప్రారంభించనున్నట్టు ఆమె తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలను అన్వేషించేందుకు తమ పరిధిని విస్తరించేందుకు ఎంఎస్ఎంఇలకు సమగ్ర మార్గదర్శనం, వనరులు, నెట్ వర్కింగ్ అవకాశాలను ఉచితంగా కల్పించనున్నారు. ఎంఎస్ఎంఇ ఫోరం అధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ 8వారాల్లో ఎగుమతి ప్రారంభించే ఆధునిక కార్యక్రమాన్ని చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇ-కామర్స్ దేశంలో గేమ్ చేంజర్ కానుందన్నారు. విదేశీ వ్యాపారాల జాయింట్ డైరెక్టర్ డోనా ఘోష్, అమెజాన్ ఇండియా వ్యాపార ముఖ్యులు భూపేన్ వాకంకర్, యుపిఎస్‌కు చెందిన బ్రిట్టో ప్రేమకుమార్, యెస్‌బ్యాంక్ గణేశ్‌యోగేశ్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో కేంద్రమంత్రి శోభాకరంద్లాజె తదితరులు

మైసూరులో బిజీ బిజీగా సీఎం

బెంగళూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మైసూరు పర్యటనలో రెండోరోజు శనివారం పలు కార్యక్రమాలతో బిజీగా గడిపారు. గ్యారెంటీ పథకాల గురించి ప్రత్యేక పుస్తక విడుదల కార్యక్రమంలో మహనీయుల మాటలను ప్రస్తావించారు. ఆకలైనవ్యక్తికి అన్నం ఇవ్వడం ద్వారా దేవుడికి సమర్పించే కానుక వంటిదన్నారు. ఉచిత పథకాల గురించి కర్ణాటక, కేరళ, తమిళనాడు, మానవ అభివృద్ధి సూచీలో ముందంజలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలు, కొవిడ్ అనంతరం ప్రజలు ఎదుర్కొంటున్న ఆకలి, పేదరిక పరిస్థితిని అధిగమించేందుకు దోహదపడతాయన్నారు. గ్యారెంటీ పథకాలు ప్రజాప్రభుత్వాన్ని బలోపేతం చేస్తాయన్నారు. పేదలకు అందుతున్న పథకాలతో సామాజిక చైతన్యం పెరుగుతోందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయం నెరవేరనుందన్నారు. ప్రాధ్యాపకులు కేవై నారాయణ స్వామి, ప్రొఫెసర్ ఎం చంద్రపూజారి, కన్నడ అభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు పురుషోత్తమ బిళిమలె తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ 2017 నుంచి భారత ఆర్థిక పరిస్థితి కుంగిపోయిందన్నారు. నిరుద్యోగం, పేదరికం కారణంగా జీడీపీ పడిపోయిందన్నారు. ఇటువంటి భయానక ఆర్థిక పరిస్థితుల్లో రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీలు సామాన్యులకు ఎంతో అనుకూలంగా ఉందన్నారు.

9 వేల మంది వైద్యులను సృష్టించిన కళాశాల

ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో వైద్యుల పాత్ర కీలకమని సీఎం సిద్ధరామయ్య అభిప్రాయపడ్డారు. మైసూరు మెడికల్, రీసెర్చ్ కళాశాల శతమానోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. వందేళ్ల చరిత్ర కల్గిన మెడికల్ కళాశాల నుంచి 9వేలమంది వైద్యులను సృష్టించిన ఘనత ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ కళాశాల వైద్యులు ఉన్నారన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకంటే ప్రభుత్వ ఆసుపత్రులలో నిపుణులైన, అనుభవజ్ఞులైన వైద్యులు ఉన్నారనేది తన భావనగా పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేవారిలో సామాన్యులే అధికమని వీరికి వైద్యులే దేవుడితో సమానంగా చూస్తారన్నారు. రోగం వచ్చాక చికిత్స అందించడం ఒక ఎత్తైతే, రోగం రాకుండా చికిత్సలు అందించడం మరొక బాధ్యత వైద్యులపై ఉందన్నారు. వైద్యులు సమాజ ఆస్తి అన్నారు. ప్రజలకు డాక్టర్లు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్ప, వైద్య మంత్రి శరణప్రకాశ్ పాటిల్, ఎమ్మెల్యేలు తన్వీర్‌సేఠ్, హరీశ్‌గౌడ, డాక్టర్ శ్రీనివాస్, ఎమ్మెల్సీ డాక్టర్ తిమ్మయ్య, సీనియర్ ఐపీఎస్ బోరలింగయ్య తదితరులు పాల్గొన్నారు.



మైసూరులో ప్రసంగిస్తున్న సీఎం సిద్ధరామయ్య

ఏపీ సీఎం సహాయనిధికి ఫోరం సభ్యుల విరాళం



మంత్రి నారా లోకేశ్‌కు చెక్కు అందజేత

బెంగళూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ సీఎం సహాయనిధికి బెంగళూరు టీడీపీ ఫోరంనకు చెందిన ప్రతినిధులు విరాళాల పరంపర సాగిస్తున్నారు. తాజాగా శనివారం ఏపీ ఐటీ మంత్రి నారా లోకేశ్ 2,56,252 రూపాయల చెక్కును ఫోరం సభ్యులు అందించారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్‌తోపాటు సభ్యులు కోకా కేశవ్, యోగేశ్ గోపినేని, వంశీ మన్నం, సతీశ్ ఆవల, రామాంజినేయులు పాల్గొన్నారు. ఈ మేరకు ఫోరం ప్రతినిధులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కమ్మగొండనహళ్ళిలో 2న వైద్య శిబిరం

జాలహళ్ళి, సెప్టెంబరు 28: అక్టోబరు 2న కమ్మగొండనహళ్ళిలో అశోక్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, డీఆర్ అకాడమీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు నిర్వాహకులు కేసీ అశోక్ తెలిపారు. కేబీసీ ట్రస్టు ఆధ్వర్యంలో 29వ వార్షిక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రాంత ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని విధాలా వైద్య పరీక్షలు జరుపుతామన్నారు. రామయ్య కళాశాల డాక్టర్లు పాల్గొంటారన్నారు. ఇప్పటివరకు 15మందికి గుండె ఆపరేషన్లు, 3,700మందికి కంటి అద్దాలు, 73మందికి వినికిడి యంత్రాలు అందించామన్నారు. అకాడమీ ముఖ్యులు రంగరాజు, ఏఓ డాక్టర్ సురేశ్, డైరెక్టర్‌లు రోషన్, అశోక్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనాల కూల్చివేతపై హర్షం



ఎక్స్‌కవేటర్‌తో భవనాల కూల్చివేత ఇలా..

దొమ్మసంద్ర, సెప్టెంబరు 28: ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర గ్రామంలో దుస్థితిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఐదు వసతి భవనాలు, రెండు ఓవర్ హెడ్ ట్యాంకులను పొక్లైనర్ ద్వారా ఎట్టకేలకు కూల్చివేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. సుమారు పదేళ్లుగా ఈ కట్టడాలు శిథిలావస్థలో ఉన్నాయి. ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేయడానికి సిద్ధమైన దొమ్మసంద్ర గ్రామపంచాయతీ అధ్యక్షుడు నరేశ్, మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు ఉమేశ్‌బాబు చొరవతో శనివారం కార్యాచరణ నిర్వహించారు. దొమ్మసంద్రలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టుపక్కల నాలుగు పంచాయతీలు, 25 గ్రామాలకు ప్రధాన కేంద్రంగా ఉంది. ఇక్కడ పేదలు, కూలి కార్మికులు ఎక్కువగా ఉన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం ప్రజలు వస్తుంటారు. ఈ భవనాలు ఎప్పుడు కూలుతాయోనని భయం ఉండేది. వాటిని తొలగించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి, సెప్టెంబరు 28: శ్రీసత్యసాయి జిల్లాలోని బాలసదన్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరం, హిందూపురం ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు అక్టోబరు 1వ తేదీ నుంచి 8వ తేదీ లోపు దరఖాస్తులను జిల్లా పీడీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. స్టోర్ కీపర్లు-2, కుక్-1, ఎడ్యుకేటర్-2, మ్యూజిక్ టీచర్లు-4, యోగా టీచర్లు-2, హౌస్ కీపర్లు-2, వాచ్‌మెన్-1 ఖాళీగా ఉన్నాయన్నారు.

పాఠశాలల్లో ఇకపై ప్రతిరోజూ కోడిగుడ్డు

బంగారపేట, సెప్టెంబరు 28: పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం కల్పించాలనే ఉద్దేశ్యంతో వారానికి రెండు రోజులమాత్రమే కోడిగుడ్డు ఇచ్చేవారని అయితే అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో ఇకపై 1నుంచి పదో తరగతి పిల్లలందరికీ ఆదివారం మినహా ప్రతిరోజూ కోడిగుడ్డు ఉంటుందని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి తెలిపారు. పట్టణంలోని బాలికల ప్రభుత్వ పీయూ కళాశాలలోని హైస్కూల్ ఆవరణలో అక్షరదాసోహ, మధ్యాహ్న భోజన పథకం కింద 2024-25 సంవత్సరానికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, హైస్కూల్ విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో భాగంగా వారంలో ఆరు రోజులు ఉచిత కోడిగుడ్డు, అరటిపండు, చిక్కి (బర్ఫీ) అందించే కార్యక్రమాన్ని శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పేద, మధ్య తరగతి వర్గాల పిల్లలే అధికమని వారికి పౌష్టికాహారం అందించేందుకు పలు కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమన్నారు. ఉచిత విద్యకు తోడుగా క్షీరభాగ్య అమలు చేస్తుండగా ఇటీవల పాలకు రాగిమాల్ట్ కూడా ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు గోవింద, తహసీల్దార్ వెంకటేశ్, బీఈఓ గురుమూర్తి, పురసభ సభ్యుడు వెంకటేశ్, షఫి, అరుణాచలం మణి, సుహేల్, పొన్ని, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కోడిగుడ్డు పంపిణీలో ఎమ్మెల్యే తదితరులు

క్రీడల్లో నైపుణ్యంతో రాణించండి



క్రీడా పోటీల ప్రారంభంలో ప్రముఖులు

చిక్కబళ్ళాపుర, సెప్టెంబరు 28: విద్యార్థులు కేవలం పాఠాలకే పరిమితం కాకుండా తమకు అభిరుచి కల్గిన క్రీడల్లో నైపుణ్యంతో రాణించాలని పంచగిరి విద్యా సంస్థల ట్రస్టు చైర్మన్ నవీన్‌కిరణ్ అభిప్రాయపడ్డారు. నగర శివారులోని సీవీసీ క్యాంపస్‌లో కేవీ ఇంగ్లిష్‌స్కూల్‌లో ఏర్పాటు చేసిన వార్షిక క్రీడా పోటీలకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ పాఠశాలకు చెందిన 11మంది విద్యార్థులు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో పాల్గొని సత్తా చాటి పలు బహుమతులు సాధించారన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా మొబైల్ వాడకం పెరిగిందని, నిజమైన ఆటపాటలకంటే మొబైల్‌గేమ్స్ ఆడేవారు అధికమయ్యారన్నారు. క్రీడల ద్వారా ఆరోగ్యానికి దోహదపడడమే కాక స్ఫూర్తిదాయకంగా ఉంటాయన్నారు. ఇండియన్ నేవీ కబడ్డీ కోచ్, ఏకలవ్య పురస్కార గ్రహీత రోహిత్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలంటే అభిరుచితో రాణించడం ద్వారా జాతీయ గుర్తింపు దక్కిందన్నారు. క్రీడాకారులకు గతంలోకంటే ఇప్పుడు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మునియప్ప, ప్రధానోపాధ్యాయుడు త్యాగరాజ్, గిరీశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

బెంగళూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కొన్నేళ్లుగా మధుమేహం, రక్తపోటు వంటివి వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తాజాగా చిన్నారులు సైతం హార్ట్ అటాక్‌కు గురవుతున్నారని ఈనేపథ్యంలో ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని వక్తలు పేర్కొన్నారు. వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని శనివారం నగరంలోని సక్ర ఆసుపత్రి ఆధ్వర్యంలో హార్ట్‌అథాన్ పేరిట జాగృతి అభియానను ప్రముఖనటి సంగీతా శృంగేరి ప్రారంభించారు. ప్రతి అడుగు ఆరోగ్యం కోసం అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఆరోగ్యకర జీవనశైలికి మంచి అలవాట్లు పాటించాలన్నారు. ఆధునిక జీవనశైలి కారణంగా ఒత్తిడి అధికమై బీపీ, షుగర్‌తోపాటు హార్ట్ సమస్యలు వస్తున్నాయన్నారు. ఆసుపత్రి ఎండీ యుచి నగాను, డిప్యూటీ ఎండీ నవోయా మాట్సుమి, గ్రూప్ సమన్వయ అధికారి లవకేశ్‌పాసు, హృద్రోగ విభాగం డైరెక్టర్, హెచ్ఓడీ డాక్టర్ శ్రీకాంత్ శెట్టి, ఉపాధ్యక్షుడు గురుప్రదా పూంజా తదితరులు పాల్గొన్నారు.



జాగృతిలో పాల్గొన్న సభ్యులు

దోపిడీ దొంగల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

దొడ్డబళ్ళాపుర, సెప్టెంబరు 28: దోపిడీకి పథకం వేసిన దుండగులను పోలీసులు అరెస్టు చేశారు. జాతీయ రహదారికి అనుబంధంగా ఉండే డాబాలకు వచ్చే ఒంటరి వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని వారినుంచి నగదు, ఆభరణాలు, మొబైల్ చోరీకి పాల్పడే వారిని అరెస్టు చేశారు. బాలకృష్ణ, హర్షవర్ధన్, అనిల్‌కుమార్ అనే ముగ్గురిని అరెస్టు చేసినట్టు దొడ్డబెలవంగల పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎంబి నవీన్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డాబాలో భోజనం చేసి వాపసు వెళ్లే ఒంటరి వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని దోపిడీ చేసే ముఠాను అరెస్టు చేశామన్నారు. గడిచిన 3-4 నెలల్లో దొడ్డబళ్ళాపుర - దేవనహళ్ళి రహదారిపై ఇలాంటి దోపిడీలు పెరగడంతో ప్రత్యేక నిఘా వేసి ఎట్టకేలకు నిందితులను అరెస్టు చేశామన్నారు. బాలకృష్ణపై రౌడీషీటర్ నమోదు చేశామన్నారు. బాలకృష్ణ, అనిల్‌కుమార్‌పై మాదనాయకనహళ్ళి, మండ్య, పీణ్యా, బాగలగుంటె, యలహంక, కెంగేరి, దొడ్డబెళవంగల పోలీస్‌స్టేషన్‌లలో పలు కేసులు ఉన్నాయన్నారు. జైలుకు వెళ్లి వచ్చినా బుద్ధిరాలేదని విడుదలయ్యాక కూడా జైలులోని స్నేహితుల ద్వారా మళ్లీ నేరాలకు పాల్పడుతున్నారన్నారు.

గూడ్స్ వాహనం ఢీ కొని ఒకరి మృతి

కోళ్ల తరలిస్తున్న గూడ్స్ వాహనాన్ని ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో బైక్ చోదకులు మృతి చెందాడు. బాశెట్టిహళ్ళిలో శనివారం ఉదయం ప్రమాదం చోటు చేసుకోగా ప్రవీణ్ మృతి చెందాడు. మధుగిరి సద్దుగుంటె గ్రామానికి చెందిన ప్రవీణ్ స్థానికంగా బాశెట్టిహళ్ళిలో ఒక దుకాణంతో జీవనం సాగిస్తున్నట్టు తెలుస్తోంది. ఘటనపై దొడ్డబళ్ళాపుర గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నాణ్యమైన ఆహారం అందించండి

» హాస్టల్ విద్యార్థుల డిమాండ్

బాగేపల్లి, సెప్టెంబరు 28: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర హాస్టల్‌లోని సమస్యలపై విద్యార్థులు నిరసన తెలిపారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయం వద్ద శనివారం తమ ఆక్రోశం వ్యక్తం చేశారు. తమకు నాణ్యమైన ఆహారం ఇవ్వడం లేదని ఆరోపించారు. హాస్టల్‌లో కొన్నిరోజులుగా శుచి రుచి లేని ఆహారం ఇస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చినా ప్రయోజనం లేకపోయిందని అందుకే నిరసన చేపట్టామన్నారు. కనీస సదుపాయాలు, నాణ్యమైన ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ, డీఎస్ఎస్ ఇతర సంఘాలు విద్యార్థులకు మద్దతు ఇచ్చాయి. పరుపు, దిం డు, దోమతెర, బ్రష్, పేస్ట్ సోప్, పుస్తకాలు ఇవ్వడం లేదన్నారు. హాస్టళ్లకోసం ఉద్దేశించిన మూడేళ్ల గ్రాంట్లకు సంబంధించి సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకుడు చన్న రాయప్ప మాట్లాడుతూ విద్యార్థులకు కేటాయించే సదుపాయాలలో కూడా అక్రమాలు చోటు చేసుకోవడం దారుణమన్నారు. నిరసనలో డీఎస్ఎస్ జిల్లా సంఘటనా సంచాలకులు కిరణ్ కుమార్, తాలూకా సంచాలకుడు నరసింహప్ప, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న హాస్టల్ విద్యార్థులు

డాక్యూమెంట్లు పోయినవి

L.యల్లారెడ్డి S/o L.నాగారెడ్డి, లింగదేవనహళ్లి గ్రామం, బళ్లారి తాలుకా మరియు జిల్లా. అను పేరున గల డాక్యూమెంట్లు నెం.2380/1984 (తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, మేడ్చల్ తాలుకా, బౌరాంపేట గ్రామం లోని బయలు స్థలం) 15-07-2024వ తేదీ మధ్యాహ్నం 2-30 గంటల సమయంలో పి.డి,హళ్ళి వద్ద పోయినాయి. ఎవరికైనా దొరికిన యెడల 9591983753 సెల్ నెంబరుకు తెలుపగలరు.

రోడ్డు ప్రమాదంలో కర్ణాటక పోలీసులకు గాయాలు



గాయపడిన కానిస్టేబుళ్లు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 28: శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలంలో ని రాంపురం క్రాస్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం తూముకూరు జిల్లా మద్దిగిరి పోలీసులు గాయపడ్డారు. చీటింగ్ కేసు విషయంలో దొంగలను పట్టుకునేందుకు మద్దిగిరి ఎస్ఐ అమ్మన్నగారి, ఒకానిస్టేబుల్స్ రమేష్, ప్రకాష్, ముద్దరాజ్ కారులో బయలుదేరారు. రాంపురం క్రాస్ వద్ద కుక్క అడ్డురావడంతో కారు అదుపుతప్పి.. బోల్తాపడింది. దీంతో ఎస్ఐకు స్వల్ప, కానిస్టేబుల్స్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108లో ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పార్లమెంట్‌స్థాయి కమిటీ సభ్యుడిగా బీకే

పెనుకొండ, సెప్టెంబరు 28: పార్లమెంట్‌స్థాయి ఉక్కుగనులు, బొగ్గుశాఖ కమిటీ సభ్యుడిగా హిందూపురం ఎంపీ బీకే పార్థసారథిని నియమించారు. తనను నియమించిన ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీశాఖ మంత్రి నారాలోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బీకే పార్థసారథి తెలిపారు.

పత్రికా పంపిణీదారుల సంఘానికి చేయూత

బెంగళూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దినపత్రిక పంపిణీదారుల సంఘానికి తగిన భవనం కోసం స్థలాన్ని కేటాయించి అండగా ఉంటామని యలహంక ఎమ్మెల్యే విశ్వనాథ్ వెల్లడించారు. యలహంక ఉపనగర్‌లోని అంజనేయ సముదదాయభవనంలో పదో వార్షిక దినపత్రికల పంపిణీదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. యలహంక, యలహంక ఉపనగర, మారుతినగర, బాగలూరు క్రాస్, యలహంక ఎయిర్‌ఫోర్స్, సింగనాయకనహళ్ళి తదితర ప్రాంతాలకు చెందిన దినపత్రికల పంపిణీదారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంఘానికి, సంఘం సభ్యులకు స్థలం కేటాయించే హామీని, అవసరమైన భవనాన్ని నాలుగైదు నెలల్లో కేటాయించే భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సతీశ్, రవి, మంజునాథ, శంభులింగ, లతా, శంకర్, వీరభద్ర, రాజశేఖర్, మూర్తి, శశికుమార్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విశ్వనాథ్‌కు సన్మానం

రేబిస్ నియంత్రణకు టీకాలు తప్పనిసరి

శిడ్లఘట్ట, సెప్టెంబరు 28: వరల్డ్ రేబిస్ డేను పురస్కరించుకుని తాలూకా కేంద్రమైన పశువుల ఆసుపత్రి వద్ద శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ తాలూకా అధికారి డాక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో కుక్కల పెంపకంపట్ల ప్రజలలో ఆసక్తి పెరిగిందని వాటి ఆరోగ్యం కోసం అవసరమైన టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. లేనిపక్షంలో అవి రేబిస్ తదితర రోగాల బారిన పడడమే కాక వాటి ప్రభావం ఇంట్లోని కుటుంబీకులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ భరత్, అభిలాష్, తాలూకా ఆరోగ్య అధికారి ఎంఎస్ దేవరాజ్, విజయమ్మ, వైద్యులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో డాక్టర్ శ్రీనాథ్ తదితరులు